నేడు తెలంగాణ సాయుధ పోరాటయోధుడు
దొడ్డి కొమురయ్య వర్ధంతి

నమస్తే తెలంగాణ

హాథ్రస్‌లో మృత్యుఘోష

యూపీలో పెద్దఎత్తున సత్సంగ్ భక్తుల మృతికి కారణమైన హాథ్రస్ దుర్ఘటన మన దేశంలోని వ్యవస్థల పనితీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. నిర్వాహకుల నేరపూరిత నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపుతున్నది. మతపరమైన లేదా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ అనేది దైవాధీనంగా ఉండిపోవడాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తున్నది. బాబా నారాయణ్ హరి (సాకర్ విశ్వహరి భోలే బాబా) అనే ఆధ్యాత్మికవేత్త నిర్వహించిన సత్సంగ్‌లో 120 మందికిపైగా భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వందలాది మంది గాయపడి దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. బాబా అనుగ్రహ భాషణం ముగించుకొని వెళ్లిపోతుండగా భక్తులు ఒక్కసారిగా ఆయన ఆశీస్సుల కోసం ఎగబడటంతో తొక్కిసలాట జరిగిందంటున్నారు. హాథ్రస్‌కు 47 కిలోమీటర్ల దూరంలోని ఫూల్రాయ్ గ్రామ సమీపంలో ఎగుడుదిగుడుగా ఉండే పొలాల్లో తాత్కాలికంగా టెంట్లు వేసి, భారీ ఎత్తున జనాన్ని పోగేసిన నిర్వాహకులు అందుకు అవసరమైన రీతిలో భద్రత, వైద్య సదుపాయాలు కల్పించలేదని స్పష్టంగా తెలుస్తున్నది. కనీస జాగ్రత్తలు కూడా పాటించలేదని ప్రాథమిక నివేదికలు తెలియజేస్తున్నాయి.

80 వేల మందితో సత్సంగ్ నిర్వహణకు అధికారుల నుంచి అనుమతి తీసుకుంటే సుమారు రెండున్నర లక్షల మంది హాజరయ్యారని ఒక అంచనా. భారీ సంఖ్యలో జనం హాజరైన సమావేశానికి కేవలం 70 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఘటనాస్థలంలో కేవలం ఒకే ఒక వైద్యుడు అందుబాటులో ఉండటం నిర్వాహకుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. నిర్వాహకుల లెక్కలేని తనానికి అధికారుల నిర్లక్ష్యం కూడా తోడవడంతో అమాయకులు బలైపోయారు. సత్సంగ్ నిర్వహించిన మనావ్ మంగల్ మిలాన్ సద్భావన సగమం కమిటీ బాధ్యులను నిందితులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదైంది. పోలీసులకు అందిన ఫిర్యాదులో బాబా పేరు ఉన్నప్పటికీ ఎఫ్ఐఆర్‌లో ఆయనను నిందితునిగా చేర్చకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనేక మంది భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తర్వాత బాబా పరారీలో ఉండటంపైనా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

మన దేశంలో మతపరమైన ఉత్సవాల్లో తొక్కిసలాట జరిగి పెద్దఎత్తున ప్రాణాలు కోల్పోయే సంఘటనలు తరచూ జరుగుతుంటాయి. ఇలాంటివి చోటుచేసుకున్నప్పుడు నేతలు సంతాపం ప్రకటించడం, మృతుల కుటుంబాలకు సాయం అందజేసి చేతులు దులిపేసుకోవడం షరా మామూలే. నిర్వాహకుల తీరులో ఎలాంటి మార్పు రాదు. అనుమతులు, పర్యవేక్షణ విషయంలో అధికారుల నిర్లక్ష్యమూ మారదు. కేసులు నమోదు చేసి విచారణలు చేపట్టినప్పటికీ నిందితులకు శిక్షలు పడిన దాఖలాలూ తక్కువే. ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించిన నిర్దిష్టమైన నియమ నిబంధనలు, విధివిధానాలు లేకపోవడం పెద్ద సమస్య. జవాబుదారీతనం కట్టుదిట్టంగా ఉండదు. దీనిని ఎత్తిచూపుతూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు కావడం గమనార్హం. హాథ్రస్ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని పిటిషనర్ కోరారు. సర్వోన్నత న్యాయస్థానం చొరవతోనైనా తగిన పర్యవేక్షణా వ్యవస్థ ఏర్పడితే అమాయకుల ప్రాణాలకు రక్షణ కలుగుతుంది.

మారిన బాణి.. విపక్ష వాణి

నూతన ప్రభుత్వం కొలువు తీరాక గత వారం రోజుల పాటు జరిగిన తొలి పార్లమెంట్ సమావేశాల్లో ఇరు సభలు దద్దరిల్లిపోయాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సాగిన చర్చల్లో ప్రభుత్వ, విపక్షాల నేతల ప్రసంగాలు కొత్త వేడిని పుట్టించాయి. గత పదేండ్లుగా ఏకపక్షంగా సాగిన సభా కార్యక్రమాలకు ఎంతో భిన్నంగా ఇవి ప్రజాస్వామ్య స్ఫూర్తితో కొనసాగాయి. సభలో పెరిగిన విపక్షాల బలం వారి గొంతుల్లోనూ ప్రతిధ్వనించింది. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా ఇచ్చి ప్రజలు దేశానికి ఎంతో మేలు చేశారని ఈ సమావేశాల తీరు తెలుపుతున్నది.

బి.నర్సన్
94401 28169

జూలై 1న లోక్‌సభలో తొలుత ప్రతిపక్షనేతగా రాహుల్‌గాంధీ, ఆ తర్వాతి రోజున ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఇరువురి మాటలు వాగ్బాణాల యుద్ధాన్ని తలపించాయి. రాహుల్‌గాంధీలో తన వెనుక రెండు వందలకు పైగా సభ్యులున్నారన్న ధీమా కనబడింది. ఇండియా కూటమి సభ్యులు కూడా ఒకరిని మించి ఒకరన్నట్టు ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై నిలదీశారు. పాలక పక్షమైన ఎన్డీయే వీరి గొంతుల ముందు చిన్నబోయిందనే చెప్పాలి. ఈ విమర్శలను తట్టుకోలేక ప్రధాని మోదీ స్వీయ రక్షణలో పడ్డారనవచ్చు. విపక్షాలు స్పష్టంగా ప్రస్తుత సమస్యలను ఎత్తిచూపితే ప్రధాని గత చరిత్ర తవ్వుతూ కాంగ్రెస్‌పై విరుచుకుపడే ప్రయత్నం చేశారు.

సభలో బీజేపీ హిందుత్వంపై రాహుల్ చేసిన మాటల దాడి ఎంతో సాహసోపేతమైనది. మతం పేరుతో వైషమ్యాలను, హింసను రేకెత్తిస్తున్న బీజేపీ దేశంలో హిందువులకు ప్రతినిధి కానే కాదని దృఢంగా అన్నారు. దేవుళ్ల ఫొటోలు చూపుతూ వీరందరూ శాంతిని బోధించారని, మీరేమో అశాంతిని సృష్టిస్తున్నారని, ఈ లెక్కన మీరు హిందువులే కారని ఘాటుగా విమర్శించారు. మీ పక్షాన లేని హిందువుల ఓట్ల వల్లనే కాంగ్రెస్ 99 సీట్లు, ఇండియా కూటమి 234 స్థానాల్లో గెలిచిందని, ఈ ఫలితాలే దేశంలో హిందువులంతా బీజేపీ వైపు లేరని రుజువు చేస్తుందన్నారు. హిందువులందరూ గంపగుత్తగా బీజేపీ పక్షం కాదనే వాస్తవాన్ని స్థిరపరచేందుకు రాహుల్‌గాంధీ ప్రయత్నించారు. దేశంలో అన్ని సమస్యల కన్నా ఇదే పెద్ద సమస్య. మతం పేరు మీద ఓట్లు కొల్లగొట్టాలనుకొనే బీజేపీ తంత్రం ఇక సాగకూడదనే సంకల్పం ఆయన మాటల్లో కనబడింది. 'తమను తాము హిందువులనుకొనేవారు 24 గంటలు దేశంలో హింసను, విద్వేషాన్ని, అసత్యాన్ని పెంచుతున్నారని' అన్నారు. వెంటనే లేచిన ప్రధాని 'ఇదీ ఎంతో తీవ్రమైన విషయం. మొత్తం హిందూ జాతిని హింసావాదులుగా చిత్రిస్తున్నారు' అని అన్నారు. 'కాదు, కాదు.. నా మాటలు కేవలం బీజేపీకి, ఆరెస్సెస్‌కు మాత్రమే వర్తిస్తాయి' అని రాహుల్ అదేస్థాయిలో సమాధానమిచ్చారు. బీజేపీ ఒక రాజకీయ పార్టీ తప్ప దేశంలోని హిందువులందరూ తమకు ప్రతినిధిగా దానిని భావించడం లేదనే సత్యం లోకానికి తెలియజెప్పే ప్రయత్నం ఆయన చేశారు. మతతత్వాన్ని పట్టుకొని బీజేపీ దేశ పాలనలో ముందుకు సాగకుండా కట్టడి చేసే విధంగా ఆయన ప్రసంగం సాగింది. హిందువులంతా తమ వెంట ఉన్నారనే బీజేపీ భావనను దెబ్బ తీసేందుకు ఆయన అన్నివిధాలా సాహసించారు.

నిండు సభలో ప్రధానిగా మోదీ ఇంత ఘాటైన విమర్శను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి. ఆయన ముఖంలో గంభీరతతోపాటు విచారం కూడా కనబడింది. విపక్ష నేతలుగా టీఎంసీ సభ్యులు మహువా మొయిత్రా, కళ్యాణ్ బెనర్జీ ప్రసంగాలు మోదీని నిలదీసేలా ఉన్నాయి. రాచరిక చిహ్నమైన సింగోల్‌ను కొత్త పార్లమెంట్‌లో ప్రతిష్ఠించినందుకు బదులుగా బీజేపీ 63 సీట్లు కోల్పోయిందని మొయిత్రా విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంలో దేశ ప్రజలు స్థిరమైన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. అది పూర్తిగా అసత్యం. వారి ప్రసంగంలో మణిపూర్ ప్రస్తావన లేదు. తన ప్రసంగ ఆరంభ సమయంలో సభలోంచి వెళ్లిపోతున్న మోదీని 'అలా వెళ్లకండి మోదీజీ, నా మాటలు వినండి!' అంటూ ఆమె కోరారు. కళ్యాణ్ ముఖర్జీ ప్రసంగంలో మోదీ ప్రభుత్వానికి ఉన్న సంఖ్యాబలాన్ని ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు పక్కకు జరిగితే కూలిపోయే సర్కారును సుస్థిర ప్రభుత్వం అనడంపై అభ్యంతరం తెలిపారు. మోదీ గ్యారంటీలకు వారంటీ లేదన్నారు. అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ అయోధ్యలో బీజేపీ ఓటమి రాముడి నిర్ణయమన్నారు.

> ప్రధాని మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ చరిత్రను లేవనెత్తారు. అంబేద్కర్‌ను నెహ్రూ ఇబ్బంది పెట్టారని, ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించారని, వరుసగా పదేండ్లు పాలనకు దూరమున్నందున నిరాశతో మాట్లాడుతున్నారన్నారు. తనకు 99 మార్కులు వచ్చాయని కొడుకు తల్లికి ప్రోగ్రెస్ రిపోర్ట్ చూయిస్తే ఇవి వందకు కాదు, 543లో అని తల్లి సర్దిచెప్పిందని, సైకిల్‌పై నుంచి పిల్లవాడు పడితే, ఆయన నిరుత్సాహపడకుండా చీమ అడ్డం రావడం వల్ల పడ్డావు, తప్పు నీదేంలేదు అని ఓదార్చినట్లు అంటే పిట్టకథలు చెప్పారు. రాహుల్ మాటలన్నీ పిల్లచేష్టలుగా ఉన్నాయంటూ కొట్టిపారేశారు. సభా మర్యాదను భంగపరిచేలా, హిందువులను కించపరిచేలా మాట్లాడిన రాహుల్ మాటలను తేలిగ్గా తీసుకోవద్దని, తగిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పీకర్‌ను కోరారు.

లోక్‌సభా కార్యక్రమాలను ఎందరో టీవీల్లో లైవ్‌లో చూసి ఉంటారు. మళ్లీ పార్లమెంట్ సమావేశాలకు కళ వచ్చిందనిపించింది. ప్రధానిగా మోదీ విపక్షాల జోరును ఎదుర్కోవడం ఇదే మొదటిసారి. సభ సమఉజ్జీగా సాగుతూ ఎన్నో ప్రజా సమస్యలను, ప్రభుత్వ తప్పిదాలను సూటిగా ప్రశ్నించే అవకాశం విపక్షాలకు లభించింది. ఇదీ ప్రజా విజయం.

రసవత్తర
రాజకీయం

బుద్ధా మురళి

ఈ నెల 6న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇరువురు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సమావేశమవుతారు. రెండు రాష్ట్రాలు ఏర్పడి పదేండ్లు పూర్తవుతున్నా రెండు రాష్ట్రాల మధ్య పరిష్కారం కానీ సమస్యలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆ సమస్యలను పరిష్కరించుకుందాం. 6న సమావేశం అవుదామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ రాయగా, దానికి బదులుగా తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి సరే అని లేఖ రాయడంతో ఇరువురి సమావేశం ఖరారైంది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం మంచిదే. ఈ సమావేశంతో సమస్యలన్నీ తీరిపోతాయనే అత్యాశలేమీ పెట్టుకోవద్దు. సమావేశం తర్వాత కూడా కొన్ని సమస్యలు అలానే ఉంటాయి. నిజానికి అధికారుల స్థాయిలో నాలుగైదు సార్లు సమావేశాలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత చివరలో ముఖ్యమంత్రుల స్థాయిలో సమావేశం జరగాలి. అయితే ఇక్కడ పరిష్కారం నోచుకోని సమస్యలకు ఇరువురి సమావేశంలో పరిష్కారం దొరుకుతుందనే ఆశ కన్నా సుహృద్భావ పరిస్థితుల్లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరగడమే శుభసూచకం అనుకోవాలి. ఈ సమావేశంతో రెండు రాష్ట్రాలకు మంచే జరుగుతుందని నమ్ముదాం.

> రాజకీయాల్లో, జీవితంలో సినిమాలను మించిన ఊహించని మలుపులుంటాయి. సినిమాలో హీరో ఎవరో, విలన్ ఎవరో ప్రేక్షకునికి ముందే తెలుసు కాబట్టి సినిమా కథలో దర్శకుడు ఎన్ని ట్విస్ట్‌లు పెట్టినా ప్రేక్షకునికి అవి తెలిసి పోతుంటాయి. రాజకీయాల్లో, జీవితంలో ట్విస్ట్‌లను ముందే ఊహించలేం కాబట్టి అవి ఎప్పుడూ సినిమాలకన్నా ఆసక్తిగా ఉంటాయి. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా సమావేశం కావడమే రాజకీయాల్లో ఊహించని మలుపు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడం వింతేమీ కాదు. కానీ, ఒక పార్టీలో పనిచేసిన ఇద్దరు నాయకులు రెండు వేర్వేరు పార్టీల ద్వారా రెండు వేర్వేరు రాష్ట్రాలకు సీఎంలుగా సమావేశం కావడం ఆసక్తికరం.

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత మీడియా సమావేశంలో ఓ విలేకరి రేవంత్‌రెడ్డి రాజకీయ గురువు బాబు అని ఏదో ప్రశ్నిస్తుంటే... 'చంద్రబాబు తనకు రాజకీయ గురువు అంటే వంగబెట్టి గుద్దుతా' అంటూ సీరియస్‌గా స్పందించారు. అంతకుముందు మరో మీడియా సమావేశంలో 'తనకు బాబుతో మంచి సంబంధాలే ఉన్నాయని, మీరు తిట్టించాలని ప్రయత్నించినా నేను తిట్టను' అన్నారు. ఇద్దరి మధ్య వ్యక్తిగతంగా ఎలాంటి సంబంధ బాంధవ్యాలున్నా తెలంగాణ ప్రయోజనాలను కాపాడటం సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యత. అలానే ఆంధ్రా ప్రయోజనాలు కాపాడటం చంద్రబాబు బాధ్యత.

> రేవంత్‌రెడ్డి టీడీపీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు తనది చంద్రబాబుది కర్ణ, దుర్యోధన స్నేహం లాంటిదని, ఆ స్నేహం ఎప్పుడూ వదులుకోనన్నారు. బాబు శిష్యుడిని అంటే వంగో బెట్టి గుద్దుతా అని అన్నా, వైఎస్ ఆర్ పావురాల గుట్టలో కనిపించకుండా శమయ్యాడని అన్నా ఈ రెండు సామాజికవర్గాల మద్దతు సాధించడంలో రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. కాంగ్రెస్ సామాజికవర్గం విజయం కోసం టీడీపీ సామాజిక వర్గం కృషి చేస్తుందని రాష్ట్ర విభజనకు ముందు ఊహకందని విషయం.

రేవంత్‌రెడ్డి, చంద్రబాబుల మధ్య వ్యక్తిగత బాంధవ్యాలు ఎలా ఉన్నా.. ఇరువురికి తమ తమ రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడే బాధ్యత ఉంటుంది. చంద్రబాబు, రేవంత్ రెడ్డిలది వ్యక్తిగత సంబంధాలు, అనుబంధాలు తప్ప రెండు పార్టీల మధ్య అనుబంధంగా చూడలేం. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' తమ లక్ష్యమని బీజేపీ ప్రకటించుకున్నది. అలాంటి బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టడానికి మద్దతు ఇచ్చింది చంద్రబాబు. బీజేపీ ప్రభుత్వాన్ని నిలబెడుతున్న చంద్రబాబుకు కాంగ్రెస్ నుంచి పార్టీ పరంగా అండ ఉంటుందని భావించలేం. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత స్థాయిలో స్నేహాన్ని కొనసాగించవచ్చు కానీ, అంతకుమించి అడుగు వేయడానికి కాంగ్రెస్ హైకమాండ్ అంగీకరించదు. ప్రస్తుతానికి కాంగ్రెస్ హైకమాండ్ వద్ద రాష్ట్ర కాంగ్రెస్‌లో ఏ సీనియర్‌కూ లేనంత పలుకుబడి రేవంత్‌రెడ్డికి ఉన్నది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమస్యలపై ఏం చర్చిస్తారో, ఏ నిర్ణయాలు తీసుకుంటారో, రాజకీయాలపై ఏం చర్చిస్తారో చూడాలి.

> నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి పట్ల సాధారణ ప్రజలు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించవచ్చేమో. కానీ, తెలంగాణలోని నిరుద్యోగులు మాత్రం అస్సలు సహించరు. 'నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టు' ఉద్యోగాలిస్తదేమోనని ఆశతో కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పచెప్తే ఆ పార్టీ నేడు కనీసం నిరుద్యోగుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అందుకే మరో పోరు సలపడానికి తెలంగాణ నిరుద్యోగ యువత సిద్ధమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని సహించేది లేదని తెగేసి చెప్తున్నదీ తెలంగాణ గడ్డ.

యువతకు నమ్మకద్రోహం

దామెర వినోద్ కుమార్
89859 26993

ఏండ్ల తరబడి కొలువుల కోసం వేచిచూసిన 40 లక్షల మంది నిరుద్యోగుల జీవితాల్లో రేవంత్ సర్కార్ నిప్పులు పోస్తున్నది. గురుకుల కొలువుల నియామకం పూర్తయ్యాక మిగిలిన పోస్టులను తర్వాతి వరుసలో ఉన్న అభ్యర్థులతో భర్తీ చేయాలి. కానీ, అలా చేయకుండా రేవంత్ సర్కార్ వెనుకడుగు వేస్తున్నది. తద్వారా వేలాది మంది అభ్యర్థులను మానసికంగా వేధిస్తున్నది. రీలింక్విష్‌మెంట్‌ను అమలు చేసి ఒక్క పోస్టు కూడా మిగలకుండా భర్తీ చేస్తామని ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికారు. కానీ, నేడు ఆ మాటను మరిచారు. బాధిత అభ్యర్థులను సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద కూర్చొని, యాచించే స్థితికి దిగజార్చారు. అధికారమిస్తే ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ నాయకులు నేడు గ్రూప్– 2, గ్రూప్– 3 నోటిఫికేషన్‌లో పోస్టులనే పెంచడం లేదు. హామీ ఇచ్చినట్టుగానే మరో 5,000 ఖాళీలను నోటిఫికేషన్‌కు ఎందుకు జత చేయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. నమ్మి అధికారమిస్తే నమ్మక ద్రోహం తలపెట్టిన రేవంత్ రెడ్డికి కనీసం సర్కార్ పరీక్షలను వాయిదా వేయడానికి మనసొప్పడం లేదు. రూ.4 వేల నిరుద్యోగ భృతిపై కూడా మాట మార్చారు.

గ్రూప్– 1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను పిలవాలని గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులే డిమాండ్ చేశారు. కానీ, ఇప్పుడు తీరం దాటాక తెడ్డు తగలబెట్టే విధంగా మాట మారుస్తూ తప్పించుకుంటున్నారు. యూత్ డిక్లరేషన్ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. హస్తం గుర్తుతో అరచేతిలో వైకుంఠాన్ని చూపారు. మొదటి క్యాబినెట్‌లోనే మెగా డీఎస్సీని ప్రకటిస్తామన్నారు. కానీ, గద్దెనెక్కాక హామీలను మరిచి నిరుద్యోగులను నిండా ముంచుతున్నారు. మెగా డీఎస్సీకి మంగళం పాడుతూ 11 వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ లోకం క్షమించదు.

ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ఆమరణ నిరాహార దీక్షలు, నిరసనలు, ఆగ్రహజ్వాలలు రాజుకుంటున్నాయి. ఈ తరుణంలో ఇవేమీ తమకు పట్టవంటూ, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంటూ, వారితో మంత్రి పదవులను భర్తీ చేసుకోవడంలో రేవంత్ సర్కార్ నిమగ్నమైంది. ఇది ఎన్నో త్యాగాలు, పోరాటాలను చూసిన తెలంగాణ సమాజాన్ని అవమానించడమే.

కాంగ్రెస్‌కు 'ఓటు కొట్టు, జాబు పట్టు' అని గతంలో నిరుద్యోగులను ఊరించిన కోదండరాం రెడ్డి, నిరుద్యోగుల పుణ్యాన పదవులు పొందిన బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న, రియాజ్ లాంటి వారు ఇప్పుడు నిరుద్యోగుల పక్షాన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయం.

గోడ మీద క్యాలెండర్‌లో పేజీలు మారుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ మాత్రం గోడ మీదికి రావడం లేదు. ఈ నయవంచనను చూసి కడుపు మండిన నిరుద్యోగులు తమ హక్కుల సాధన కోసం టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నారు. మంత్రులకు నిరసన సెగను చూపుతున్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడ్డుకోవడానికి కూడా ఏ మాత్రం వెనకడుగు వేయరు.

> 'దోపిడి చేసే ప్రాంతేతరులను
> దూరం దాకా తన్ని తరుముతం
> ప్రాంతం వాడే దోపిడి చేస్తే
> ప్రాణంతోనే పాతర వేస్తం..!
> దోస్తుగ ఉండే వారితో మేమును
> దోస్తే చేస్తం ప్రాణమిస్తం
> ఎంతకు అంత అన్న ధోరణితో
> చింతమాని బ్రతుకును సాగిస్తం
> తెలంగాణమిది తెలంగాణమిది
> తీరానికి దూరాన ఉన్నది
> ముంచే యత్నం చేస్తే
> తీరం మునుగును తానే మునుగును తప్పక'

అన్న ప్రజాకవి కాళోజీ చూపిన బాటలో నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సబ్బండ వర్గాలతో పాటు సకల పార్టీలు సంఘటితం కావాల్సిన తరుణం ఆసన్నమైంది. నిరంకుశ నిజాం నవాబులను, కాసీం రజ్వీలను, ఆంధ్రా వలస పాలకులను తరిమిన తెలంగాణ గడ్డ ఇది. మిమ్మల్ని గద్దె దింపడం ఈ గడ్డకు పెద్ద కష్టం కాదు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకుంటే మంచిది.

రైతు భరోసా అందరికియ్యాలె

ఇటిక్యాల రామరాజు యాదవ్
94936 03075

దేశంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకనుగుణంగా రాష్ట్రాల్లో వ్యవసాయోత్పత్తులు పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కాబట్టి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సాగు చేసే భూములన్నింటికి ఎలాంటి నిబంధనలు లేకుండా సీజన్ల వారీగా రైతుబంధు తరహా పథకాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉన్నది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు స్థానంలో 'రైతుభరోసా' అనే పథకాన్ని అమలుచేయ చూస్తున్నది. అయినా పర్వాలేదు కానీ ఆ పథకాన్ని తొందరగా అమలుచేయాల్సిన అవసరం ఉన్నది.

ప్రభుత్వం రైతులకు అవసరమైన సమయంలో పెట్టుబడి సాయం చేతికందివ్వకపోతే సాగు వెనుకబడిపోయే అవకాశాలున్నాయి. అంతేకాదు సాగు భూములు బీడు భూములుగా మారి, తద్వారా దేశంలో ఆహార కొరతలు ఏర్పడే అవకాశాలున్నాయి. అంతేకాదు, కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కట్టిన ప్రాజెక్టులకు అర్థం లేకుండా పోతుంది. బీడు భూములకు రైతు భరోసా వర్తించదనే నిబంధనను అమలుచేస్తే సాగు పరిధి పెరిగే అవకాశం కూడా ఉంటుంది. వ్యవసాయం చేయలేని భూ యజమానులు తమ భూమిని కౌలుకు అప్పగిస్తారు. తద్వారా సాగు పరిధి పెరగడమే కాదు, కౌలుదారులకూ కొంత ఉపాధి కల్పించినవారమవుతాం. భూ యజమానులతో పాటు కౌలు రైతులకూ రైతుభరోసాను అమలు చేయాలి. కానీ, ఇద్దరి మధ్య కొంత వ్యత్యాసం ఉండాలి. అలాకాకుండా కౌలుదారులకే రైతు భరోసా ఇస్తే భూ యజమానులు నష్టపోతారు. ఈ క్రమంలో తమ భూమిని కౌలుకు ఇవ్వకుండా పక్షపాతం చూపెట్టే అవకాశాలున్నాయి. తద్వారా ఆహార సంక్షోభం ఏర్పడే అవకాశం ఉంటుంది. అంతేకాదు, వ్యవసాయోత్పత్తుల ఎగుమతి తగ్గి దిగుమతి పెరుగుతుంది. దీంతో పాటు లేబర్ కార్డున్న వ్యవసాయ కూలీలకు నెలకు రూ.1000 చొప్పున ఏటా రూ.12,000 ఇవ్వాలి.

పెద్ద రైతులకు, ఉద్యోగులకు, టాక్స్ పేయర్లకు రైతు భరోసా ఇవ్వకపోవడం సరైన నిర్ణయం కాదు. ఎందుకంటే సాగు విస్తీర్ణంతో పాటు ఖర్చులు కూడా అనులోమానుపాతంగా పెరుగుతాయి. పెట్టుబడికి అయ్యే ఖర్చు కోసం ఉన్న భూమిని అమ్మి సాగు చేసే బదులు, అసలు సాగు చేయకపోవడమే ఉత్తమమని పెద్ద రైతులు భావించే ఆస్కారం కూడా ఉంటుంది. కష్టనష్టాలు, వాతావరణంపై, విపత్తులపై ఆధారపడేదే వ్యవసాయం. ఉద్యోగులు, టాక్స్‌పేయర్లు సాగుచేసినా రైతుభరోసా అందివ్వమనే నిర్ణయం అన్యాయమైనది. అది వ్యవసాయాన్ని ప్రోత్సహించకుండా నిరుత్సాహపరచడమే అవుతుంది. కలెక్టర్ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగికి ప్రారంభ వేతనం రూ.80,000లకు మించి ఉండదు. అందులో శాలరీ, ఐటీ కటింగ్స్ పోను ఆ ఉద్యోగికి జీతం సుమారు రూ.60,000 వరకు వస్తుందేమో! అందులో ఇళ్లు, ద్విచక్రవాహనాల నెలవారీ ఈఎంఐలు, తల్లిదండ్రుల పోషణ ఖర్చులు, పిల్లల స్కూల్ ఫీ, ఇతర దవాఖాన ఖర్చులు పోను వారికి మిగిలేది శూన్యం. ఇలాంటి పరిస్థితిలో భూమి ఉన్నా పెట్టుబడి ఖర్చులు పెట్టుకొని వ్యవసాయం చేయడానికి ఏ ఉద్యోగి ముందుకురారు. తద్వారా ఉద్యోగుల భూములన్నీ బీడు భూములుగా మారే అవకాశం ఉంటుంది. వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వ ఉద్యోగం ఒక శాపంగా మారకూడదు. కరోనా సమయంలో చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధును ఆసరాగా చేసుకొని వ్యవసాయరంగంలోకి అడుగుపెట్టారు. ఇప్పుడు పలానా వారికే రైతుభరోసా ఇవ్వాలనే పరిమితిని విధిస్తే వ్యవసాయం కుంటుపడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం నిశితంగా పరిశీలించి సాగుకు యోగ్యమయ్యే భూములన్నింటికి ఎలాంటి పరిమితులు లేకుండా రైతు భరోసా ఇవ్వడమే శ్రేయస్కరం.

రుణమాఫీ అమలు విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాలి. రైతులు రుణాలు తీసుకున్న భూమి అగ్రికల్చర్ వెబ్‌సైట్‌లో నమోదై ఉంటేనే వ్యవసాయం కోసం తీసుకున్న రుణంగా పరిగణించాలి. అప్పుడే ఆయా రుణాలను మాఫీ చేయాలి. అప్పుడే రైతు భరోసా, రుణమాఫీ సంక్షేమ పథకాల అసలు లక్ష్యం నెరవేరుతుంది.

(వ్యాసకర్త: ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొల్లాపూర్)

నీట్‌పై ప్రజలు విశ్వాసం కోల్పోయారు!

నీట్‌పై ప్రజలు విశ్వాసం కోల్పోయారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు స్థానిక భాషల్లో స్టేట్ సిలబస్‌ను అనుసరించి విద్యనభ్యసిస్తున్నారు. కానీ, వైద్య విద్య అర్హత పరీక్ష మాత్రం ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం నిర్వహిస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసం? నీట్‌ను రద్దు చేయడమొక్కటే దీనికి పరిష్కారం. అంతేకాదు, రాజ్యాంగాన్ని సవరించి విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలి.

- విజయ్, తమిళ